# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ధరణి జోలికొస్తే తరిమికొడ్తం!

కాంగ్రెస్ కుట్రలపై రైతుల ఆగ్రహం

ధరణి
తెలంగాణ ప్రభుత్వం



నాటి రికార్డుల్లో ఉన్న 31కాలమ్స్‌తోనే అష్ట కష్టాలు పడ్డం. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో ఆ ఇబ్బందులు తప్పినయ్. ధరణి ఎత్తేసి అదే రికార్డులు తీసుకొస్తే నిత్యం అన్నదమ్ములతో పాటు ఇరుగు పొరుగు వారితో కూడా భూముల పంచాయితీ తప్పదు. నిత్యం గొడవలు, పోలీస్‌స్టేషన్లు, కోర్టు కేసులు మొదలవుతాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు భద్రత కల్పించే ధరణితో పదేండ్లుగా ప్రశాంతంగా ఉన్నామని..ప్రస్తుతం భూముల రేట్లు పెరిగినప్పటికీ రికార్డులు పక్కాగా ఉండడంతో ఏ గోలా లేదంటున్నారు. ధరణి తీసి పాత పద్ధతి పెడితే ఇప్పుడున్న భూముల రేట్లకు కబ్జాదారులు ఎక్కువై.. రికార్డులు తారుమారు చేస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో కూడా కాంగ్రెస్ వాళ్లు పాత పద్ధతే పెడ్తం అనడం.. దళారీ వ్యవస్థను ప్రోత్సహించడమే అంటున్నారు. కాంగ్రెస్ వాళ్లకు రైతుల పట్ల ప్రేమ లేదని, అలాంటి వాళ్లను మళ్లీ అధికారంలోకి రానిచ్చేది లేదని ముక్తకంఠంతో చెబుతున్నారు.

– నల్లగొండ, నవంబర్ 29

## కౌలుదారు చట్టాల అమలుతో పోలాలు పడావు

కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే కౌలు దారి చట్టాలు అమలు చేస్తానంటున్నాడు దీనితో రైతులు మధ్య కయ్యం ఏర్పడి పోలాలు పడావు పెట్టే పరిస్థితులు ఏర్పడుతాయి.భూమి కల్గి ఉన్నా రైతులు తమ అవసరాల కోసం లేదా ఉద్యోగం నిమిత్తం వేరే ప్రదేశంలో నివసిస్తున్నప్పుడు ,సాగు చేసే శక్తి లేనప్పుడు గ్రామంలోని ఇతర రైతులకు కౌలుకు ఇవ్వడం పరిపాటి.కౌలు ఇస్తే ఒప్పంద పత్రం రాసుకోవాల్సి ఉంటుంది.రాసిఇచ్చిన ఒప్పందాన్ని అడ్డుపెట్టుకొని భూ హక్కుల కోసం కోరుక్టు వెళ్లి వివాదాలు సృష్టించేవారి సంఖ్య పెరుగుతుంది. రైతు బంధు కౌలు రైతులుకు వర్తింప చేస్తామనడం వల్ల కౌలు సక్రమంగా చెల్లించకుండా రకరకాల సమస్యలు సృష్టిస్తారు.మా పోలం కౌలుకు ఇచ్చి నాలుగు ఎండ్లు అయినది. ఏ ఇబ్బంది ఇప్పటి వరకు రాలేరు.కాని కాంగ్రేస్ తేచ్చే నూతన భూమిచట్టాల వల్ల భూ యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సీఎం కేసీఆర్ రైతులు కష్టాలు తొలగించడానికి ధరణి తెచ్చాడు.రైతులు సంతోషంగా ఉన్నారు.కాంగ్రేస్ ధరణి తొలగిస్తామనడంతో రైతులు భయాందోళను గురిఅవుతున్నారు.రైతులకు న్యాయం కావాలంటే బీఆర్ఎస్ కు కాపాడుకోవాలి.

–గుర్రాల చినరాంరెడ్డి, రైతు, బొమ్మలరామారం

## ధరణి రద్దయితే భూములకు భద్రత ఉండదు



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణి పోర్టల్ తీసేస్తామంటున్నారు. ధరణి పోర్టల్ రద్దు అయితే భూములకు భద్రత ఉండదు. వారిని పెత్తందారులు దగా, దోపిడీ చేస్తారు. కాంగ్రెసోళ్లకు రైతుల బాగోగుల గురించి ఈసమంత కూడా తెలియదు. రైతుల బాగోగులను కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే బాగా చూస్తున్నది. గతంలో ధరణి పోర్టల్ లేకపోవడంతో వీఆర్వోలు లంచాలు తీసుకొని ఒకరి భూములను మరొకరికి రాసి తారుమారు చేసేవారు. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు. వ్యవసాయంలో అన్ని వసతులు కలించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుంది. ఆయనకే రైతులమంతా మద్దతిస్తాం.

–మామిడాల నర్సింహులు రైతు కొలనుపాక

## పట్వారీ వ్యవస్థతో ఇబ్బందులు పడలేం..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ రద్దు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేద్దామని చూస్తుంది. ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అన్ని పనులు సులువుగా జరుగుతున్నాయి. ధరణి తీసేస్తే మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థతో ఇబ్బందులు పడలేం. ఈ వ్యవస్థతో గతంలో కాంగ్రెస్ పాలనలో పైరవీల రాజ్యం ఉండేది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వస్తే పాత రోజులే వస్తాయి. భూ లావాదేవీల్లో ఎలాంటి ఇబ్బందులు, అవినీతికి తావులేకుండా సీఎం కేసీఆర్ ముందుచూపుతో ధరణి తీసుకొచ్చారు. దాంతో రైతులు సంతోషంగా ఉన్నారు. రైతుల మేలుకోరే సీఎం కేసీఆర్‌కే మా ఓటు.



–ముడుగుల శ్రీకాంత్, రైతు, దిలావర్‌పూర్, మోటకొండూర్



## కాంగ్రెస్‌వి కుట్రపూరిత రాజకీయాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను ఎత్తివేసి భూమాత పేరుతో కొత్త చట్టానికి రూపకల్పన చేయాలని చూస్తున్నది. ఇలాంటి చట్టాలతో రైతుల భూములకు రక్షణ కరువు అయితది. గతంలో గ్రామాల్లోని భూములు అన్యాక్రాంతం, పట్టాల మార్పిడికి గురయ్యేవి. దాంతో రైతుల మధ్య గొడవలు జరిగి పగలు, ప్రతీకారాలతో రైతుల మధ్య అంతరాలు పెరిగేవి. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అలాంటి కుట్రలకే తెర లేపింది. రైతులంతా జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో భూములకు రక్షణ ఏర్పడింది. 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్‌తో వ్యవసాయం పండుగలా సాగుతుంది. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలువాలి.

–బొర్రా ప్రవీణ్, రైతు, సిరివేణికుంట, భువనగిరి

## రైతులు రోడ్డున పడాల్సిందే


కాంగ్రెసోళ్లను నమ్మితే రైతుల బతుకులు ఆగమైతయ్. వాళ్లు అధికారంలోకి వస్తే ధరణిని తీసేసి భూమాతను తీసుకోస్తారంట. అలా చేస్తే రైతులు రోడ్డు పడాల్సిందే. ధరణితో భూములకు భద్రత ఏర్పడింది. కర్మగాలి కాంగ్రెసోళ్లు వస్తే గ్రామాల్లో పట్వారీ వ్యవస్థ మొదలై దళారులు పుట్టుకొస్తారు. అలా అయితే రైతులంతా మళ్లీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌లో నమోదైన భూములకు పంట పెట్టుబడి సాయంగా ఏటా ఎకరానికి రూ.10వేలు ఇస్తుండు. మళ్లీ గెలిచాక రూ.15వేలకు పెంచుతామన్నరు. అలాంటి ధరణిని తీసేస్తే రైతుబంధు ఎలా ఇస్తరు. ధరణి కొనసాగాల్సిందే.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందే.

–నాగుల యాయతిరాజు, రైతు, పోతిరెడ్డిపల్లి, ఆత్మకూరు(ఎం)



# కాంగ్రెస్ వస్తే ఎవుసం కుప్పకూలుడే..

కరెంట్ కోసం మళ్లీ పడిగాపులు తప్పవు
10 హెచ్‌పీ మోటరు మా వల్ల కాదు
కాంగ్రెస్ మాటలపై రైతుల ఆందోళన



కరెంటు కోసం నాడు పడ్డ కష్టాలు మళ్లీ పడాలంటే మా వల్ల కాదు..నాడు రాత్రి పూట చీకట్లో బోరు బావుల వద్దకు వెళ్లి చాలా మంది కన్నుమూసిన రోజులను ఎట్లా మర్చిపోతం. అలాంటి పరిస్థితి మళ్లీ తీసుకొస్తమని కాంగ్రెసోళ్లు చెబుతుంటే వాళ్లకు ఎట్లా ఓట్లేసేదని రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు. సీఎం కేసీఆర్ సర్కారు 24 గంటల కరెంటు ఇస్తుండడంతో సాగు బాగా అవుతుందని. అలాంటి సర్కారును వదలుకునేది లేదంటూ పేర్కొంటున్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ మూడు గంటల కరెంటే ఇస్తమంటున్నరు.. దాంతో వ్యవసాయంలో మునుగుడే తప్ప తేలేది లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం మా వల్ల కాదని, అలాంటి ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో రానివ్వమని, మా బాధలు తెలిసిన సీఎం కేసీఆర్‌నే మళ్లీ ఎన్నుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారు. పదేండ్లుగా కరెంటు కష్టాలు లేక ప్రశాంతంగా ఉంటున్నామని, మళ్లీ కరెంట్ కష్టాలు కొని తెచ్చుకోలేమంటున్న రైతులు కాంగ్రేసోళ్లకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్తామని పేర్కొంటున్నారు.

– నల్లగొండ, నవంబర్ 29



## రైతు బాధలు పట్టని కాంగ్రెస్‌ను నమ్మొద్దు

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు పడిన కరెంట్ గోస పగోడికి కూడా రావొద్దు. కాంగ్రెసోళ్లకు రైతు సమస్యలు అసలే తెలియవు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల ముంగిట కాంగ్రెస్ మరోసారి మోసం చేయాలని చూస్తుంది. ఇందులో భాగంగానే రైతులకు 3 గంటల కరెంటు చాలని, 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. వారి మాటలను నమ్మి మోసపోవద్దు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. రాత్రిపూట కరెంట్‌తో నానా ఇబ్బందులు పడ్డాం. కాంగ్రెసోళ్లు చెప్తున్నట్లుగా 3గంటల కరెంట్‌తో మడి కూడా తడవదు. వ్యవసాయం మీద అవగాహన ఉంటే, రైతు కష్టాలు తెలిసినోళ్లు అయితే 3గంటల కరెంట్‌తో పాటు 10హెచ్‌పీ మోటర్ గురించి మాట్లాడరు. సీఎంగా కేసీఆర్ వచ్చినంక కరెంట్ పోయిన రోజులు లేవు. ఫుల్ కరెంటు, దండిగా పంటలు పండుతున్నాయి. సీఎం కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులంతా ఆయన వెంటే ఉంటారు.

–బద్దం వెంకట్‌రెడ్డి, రైతు, మొరిపిరాల, ఆత్మకూరు(ఎం)



## ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్

3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అంటున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుల బతుకు ఆగమైతది. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంటు పరిస్థితి ఎలా ఉండేదో ఏ రైతుకైనా తెలుసు. మళ్లీ ఇప్పుడు వచ్చి 3 గంటల కరెంటు ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెడితే రైతులంతా ఆగం కావాల్సిందే. 10హెచ్‌పీ మోటర్లతో ఆర్థిక భారంతో పాటు అధిక లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే ప్రమాదం ఉంది. 3 గంటల కరెంట్‌తో వ్యవసాయం సాగదు. భూములు బీడుగా మారుతాయి. భూముల ధరలు పడిపోతాయి. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందుతున్నది. దాంతో రైతులంతా ఇబ్బంది లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నారు. రైతు బతుకు బాగుండాలంటే మళ్లీ కేసీఆరే రావాలి.

–కూనూరు వెంకటేశం, సిరిపురం, రామన్నపేట





## 3 గంటల కరెంట్ ఏ మూలకూ సరిపోదు

కాంగ్రెస్ హయాంలో కరెంట్‌కు తీవ్ర ఇక్కట్లు ఉండేవి. వారు ఇచ్చిన 7 గంటల కరెంటులో సగం రాత్రిపూట, సగం పొద్దున ఇచ్చేటోళ్లు. అది కూడిన లోవోల్టేజీతో వచ్చేది. మోటర్లు విపరీతంగా కాలిపోయేవి. నాటు పెట్టిన కొద్దిపాటి పొలాలు చేతికందే సమయంలో ఎండిపోయేవి. రాత్రి పూట బావుల దగ్గరకు వెళ్లి కరెంటు షాకు, పాములు, తేళ్ల కాటుకు గురయ్యేవాళ్లు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ నాయకలు రైతులకు 3 గంటల కరెంటు చాలని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. వారి మాటలు వింటే రైతులు నిండా మునగాల్సిందే. ఇప్పుడు సీఎం కేసీఆర్ సారు అందిస్తున్న నాణ్యమైన 24 గంటల కరెంట్‌తో రైతులమంతా సంతోషంగా ఉన్నాం. పంటలు పుష్కలంగా పండిస్తున్నాం. అప్పులు తీర్చి ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. ఆయనకే రైతులమంతా అండగా నిలుస్తాం.

–మల్గ గౌరయ్య, రైతు, మోటకొండూర్



## రైతుల బతుకు ఆగం చేసే కుట్ర

రైతుల బతుకులను ఆగం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలతో కూడిన ఎత్తుగడలను వేస్తున్నది. గతంలో కాంగ్రెస్ పాలనలో చీకటి రోజులను ప్రజలు ఇంకా మరచిపోలేదు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాకే భూముల ధరలు పెరిగాయి. అన్ని మౌలిక వసతులు సమకూరాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు, కౌలురైతు చట్టంతో రైతుల బతుకు ఆగమే. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేది. రేవంత్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నాడు. రైతుల కష్టాలను తీర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నంటే ఉంటాం.

–ఏనుగు వెంకట్‌రెడ్డి, రైతు, బొల్లేపల్లి, భువనగిరి కలెక్టరేట్

## కాంగ్రెసోళ్లు వద్దు.. వాళ్ల కరెంటు వద్దు



కాంగ్రెసోళ్లను ఇప్పటికే నమ్మి మోసపోయినందుకు రేయింబవళ్లు బావుల దగ్గర నిద్రలేకుండా మా తండ్రులు గడిపిన రోజులెన్నో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులకు మింగుడుపడడం లేదు. 3 గంటల కరెంట్ చాలనే కొత్త నాటకం ఆడుతుండ్రు. 3 గంటల కరెంటుతో ఎకరం పొలం కూడా పారదు. అంతేకాకుండా రాత్రిళ్లు మేము కంటి నిండా నిద్ర పోకుండా, ఇంట్లో ఉండకుండా బావుల కాడికి పోవాలి. పోయే తొవ్వలో పాము, తేళ్లకాటుకు గురి కావాల్నా? ఈ ఇబ్బందులన్నీ మేము పడలేము. రైతుగోస ఎరుగని రేవంత్‌రెడ్డి మాయమాటలను రైతులు నమ్మరు. రైతుల వెన్నంటి ఉండే కేసీఆర్ వెంటే ఉంటాం.

–తుమ్మల కొండల్, రైతు, వడపర్తి, భువనగిరి అర్బన్

## కాంగ్రెస్ వస్తే కటిక చీకట్లే



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కటిక చీకట్లు తప్పవు. రేవంత్‌రెడ్డి అంటున్న 3 గంటల కరెంటుతో రైతులు ఎవుసాన్ని పడావు పెట్టాల్సిందే. ఆయనకు వ్యవసాయంపై ఏ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతుండు. 10 హెచ్‌పీ మోటర్లు రైతులకు ఆర్థిక భారంతో కూడుకున్నవి. లోఓల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయి. తీరా పంట చేతికొచ్చే సమయంలో పొలాలు ఎండడం ఖాయం. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోకుండా వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్ వెంటే రైతులంతా ఉండాలి. సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తేనే భూములకు రక్షణ ఉంటుంది. రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు.

–మైసగోని వెంకటేశం, రేవనపల్లి, భూదాన్‌పోచంపల్లి

## 3 గంటల కరెంట్ అంటే వ్యవసాయాన్ని వదిలేయాల్సిందే



కాంగ్రెస్ పాలనలో ఎప్పటికీ కరెంట్ కష్టాలే. పంటలు పండక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చాలా మంది అప్పులకు వడ్డీలు కట్టలేక వ్యవసాయభూములను అమ్ముకున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు మొదలవుతాయి. రైతుల బతుకులు ఆగమవుతాయి. వ్యవసాయరంగాన్ని మరిచిపోవాల్సి వస్తది. నిత్యావసర సరుకులు పెరుగుతాయి. సామాన్యులు బతుకడం చాలా కష్టమవుతుంది. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లను పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం ఖాయం. ప్రస్తుతం బీఆర్ఎస్ సర్కారు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తుంది. పంట దిగుబడి మంచిగా వస్తున్నది. రైతులకు ఎలాంటి కష్టాలు లేవు. కాంగ్రెస్ పాలన గుర్తు చేసుకుంటేనే భయంగా ఉంది. వాళ్లు గెలిస్తే 3 గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. రైతులతోపాటు ఇండ్లల్లో కూడా కరెంట్ కష్టాలు మొదలవుతాయి. రైతుల సంక్షేమం కోరే బీఆర్ఎస్ వెంటే రైతులంతా ఉండాలి.

–కె.సురేందర్‌రెడ్డి, రైతు, బైరాంనగరం, ఆలేరు రూరల్